కేటీఆర్ కుటుంబంపై కుట్ర రాజకీయాలు

విందును రేవ్ పార్టీగా చిత్రీకరించడం దారుణం: దాసోజు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): కేటీఆర్ కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపారని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్ పాకాల తమ కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో విందు చేసుకుంటున్న సమయంలో 300 మంది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, ఆ విందును రేవ్ పార్టీగా చిత్రీకరించడం, ఇంటిని ఫార్మ్‌హౌస్‌గా చూపించడం, ఆ విందును కేటీఆర్‌కు అంటగట్టడం చిల్లర రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. ప్రజా సమస్యలను, ప్రభుత్వ అవినీతిని మరుగున పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా డ్రగ్స్, రేవ్ పార్టీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వీటికితోడు కొంతమంది కేంద్ర మంత్రులు, ఎంపీలు సందట్లో సడేమియా అన్నట్టు కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని పనికి రాని ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతల కుటుంబసభ్యులను వీధుల్లోకి లాగి శిఖండి రాజకీయాలు చేయడం తగదని హితవు చెప్పారు.

బెటాలియన్ సస్పెన్షన్లు దుర్మార్గం

రాష్ట్రంలో ప్రజాపాలన ముసుగులో అణచివేత పాలన కొనసాగుతున్నదని, పోలీసు సిబ్బందిపై ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నదని శ్రవణ్ మండిపడ్డారు. శాంతియుతంగా అభిప్రాయాలు వెల్లడించిన 39 మంది తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందిని సస్పెండ్ చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వం భేషరతుగా సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సబితారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కేటీఆర్‌ను ఎదుర్కోలేకే కుట్రలు

- పోలీసులను అడ్డం పెట్టుకొని డ్రామాలు
- వారెంట్ లేకుండా ఇంట్లో సోదాలా?
- జన్వాడలో దావత్ అయితే రాయదుర్గంలో రాద్ధాంతమా?
- ప్రభుత్వంపై చట్టపరంగా పోరాడుతాం
- ప్రజలు సరైన సమయంలో తిప్పికొడుతరు
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ప్రజాసమస్యలపై నిత్యం ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో రేవ్ పార్టీ జరిగిందని, విదేశీ మద్యం దొరికిందంటూ పోలీసులను అడ్డంపెట్టుకొని డ్రామాలడుతున్నారని ఫైర్ అయ్యారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ బావమరిది ఇటీవల నిర్మించుకున్న ఇంటిలో గృహప్రవేశం సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి దావత్ చేసుకుంటే చట్టవ్యతిరేక వ్యవహారంలా చిత్రీకరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడ 70 ఏండ్ల వయస్సున్న రాజ్ పాకాల తల్లి, చిన్నపిల్లలు కూడా ఉన్నారని పోలీసులు, మీడియా విడుదల చేసిన వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు. అక్కడికి వెళ్లిన ఎక్సైజ్ సీఐ, ఎస్‌వోటీ ఆఫీసర్ ఇక్కడ విదేశీ మద్యం, డ్రగ్స్ దొరకలేదంటూ స్పష్టంగా చెప్పినా దుష్ప్రచారానికి దిగడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జన్వాడలో దావత్ జరిగితే రాయదుర్గంలోని రాజ్ పాకాల ఇల్లు ఓరియంట్ విల్లాలో సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 'వాళ్లేమైనా మద్యం వ్యాపారులా? అక్కడికు వెళ్లిన లాయర్లు, నాయకులను ఇష్టమొచ్చినట్టు ఎత్తిపడేయడమేంటి? అక్కడ దొరికిందేంటి? పోలీసులు గంటగంటకూ ఎఫ్ఐఆర్‌లు మార్చడమెందుకు? ఇంత భయానక వాతావరణం సృష్టించడమెందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదంతా చూస్తుంటే ఇందులో కుట్రకోణమని స్పష్టంగా అర్థమవుతున్నదని చెప్పారు. మీడియా వాళ్లకు తెలియకుండానే వాళ్ల మీడియా ఆఫీసుల నుంచి వీడియోలు బయటకు ఎలా వస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. కుటుంబసభ్యులు చేసుకున్న దావత్‌లో ఇతరులెవరూలేరని వెల్లడైనా, కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు భూతద్దంలో చూపి చిలువలు, పలువలు చేయడం, ప్రపంచం బద్ధలైనట్టు మీడియాలో ప్రచారం చేయడం దుర్మార్గమని విమర్శించారు. 'రాజకీయాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని కచ్చితంగా నిలదీస్తాం. ఇది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా సంక్రమించింది.. కానీ ఈ ప్రభుత్వం వ్యక్తిగత కక్షలకు దిగడం, బురదజల్లడం మంచిది కాదు' అని హితవు పలికారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సరైన సమయంలో తిప్పికొడతారని హెచ్చరించారు. ఈ విషయంపై చట్టపరంగా పోరాడతామని తేల్చిచెప్పారు. ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు పక్కన బెట్టి ప్రజాసమస్యలపై దృష్టిపెట్టాలని చురకలంటించారు.

ఫాంహౌస్‌కు సొంతింటికి సంబంధమేంటి?: మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కేటీఆర్ బావమరిది సొంతంగా ఫాంహౌస్ కట్టుకొని గృహప్రవేశం చేశారని, అక్కడ చిన్న దావత్ చేస్తే ఏదో జరుగుతున్నదంటూ జన్వాడలో దాడులు చేసిన పోలీసులకు ఏమీ దొరక్కపోతే ఆయన సొంతింట్లో దాడులు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు. కేటీఆర్‌పై కక్ష తీర్చుకొనేందుకు ఆయన కుటుంబసభ్యులను బలిచేసే కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్ పాకాల ఇంట్లో ఏదో దొరికనట్టు చూపెట్టి కేసులు కట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వ పెద్దలు మానిటరింగ్ చేస్తున్నట్టు తనకు సమాచారమున్నదని చెప్పారు. పోలీసులు లాయర సమక్షంలో సోదాలు నిర్వహించాలని, మీడియా కెమెరాలను అనుమతించాలని డిమాండ్ చేశారు.

కక్షల సంస్కృతి తేవద్దు: మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణలో ఎవరి ఇంట్లో పండుగ జరిగినా దావత్‌లు సర్వసాధారణమని, రాజ్ పాకాల ఇంట్లో జరిగిన విందును పెద్దది చేయడం ఎంతవరకు సమంజసమని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనివెనుక భారీ కుట్ర కనపడుతున్నదని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కక్షపూరిత రాజకీయాలు లేవన్నారు. ఇప్పుడు కక్షల సంస్కృతిని కొత్తగా తేవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. మహబూబ్‌నగర్‌లో పదిమందిని చేరదీసి అన్నంపెట్టే తన తమ్ముడిని లేనిపోని ఆధారాలు సృష్టించి అరెస్ట్ చేశారని ఆక్షేపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్వేషపూరిత రాజకీయాలను పక్కనబెట్టి ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్‌ను బద్నాం చేసేందుకే: సబితాఇంద్రారెడ్డి

> ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్న కేటీఆర్‌ను బద్నాం చేసేందుకే ఆయన బావమరిది ఇంట్లో సర్కారు పెద్దలే వెనకుండి దాడులు చేయిస్తున్నారని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. 'తెలంగాణలో ఎవరూ శుభకార్యాలు చేసుకోవద్దా? దావత్‌లు పెట్టుకోవద్దా?' అంటూ ప్రశ్నించారు. నిన్న మొన్న పోలీసు కుటుంబాలు రోడ్డెక్కితే ఇక్కడే ఉండి స్పందించని బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇప్పుడు రాజ్ పాకాల ఇంటికి సంబంధించిన వీడియోలు మీడియాకు రిలీజ్ చేయడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. రాజ్ పాకాల ఇంట్లో సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద. చిత్రంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితరులు

రేవంత్‌కు కేటీఆర్ ఫోబియా

- ప్రజాదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ ఆరోపణలు
- సొంతింట్లో కుటుంబసభ్యులతో పార్టీ చేసుకోవద్దా?
- సెర్చ్ వారెంట్ లేకుండా ఇబ్బంది పెట్టిన పోలీసులు
- రేవంత్ కీలుబొమ్మలుగా పోలీసు అధికారులు
- తర్వాతి పరిణామాలను ఎదుర్కోక తప్పదు
- ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు, బీఆర్ఎస్‌పై పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక కేటీఆర్‌ను ఏదో కేసులో ఇరికించాలని కుట్రచేస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డి.. కేటీఆర్‌పై కూడా బురద చల్లాలని చూస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సిండ్రోమ్, కేటీఆర్ ఫోబియా పట్టుకున్నదని విమర్శించారు. కేటీఆర్ బావమరిది తన సొంతింట్లో గృహ ప్రవేశం సందర్భంగా బంధుమిత్రులను పిలిచి దావత్ చేసుకోవడం తప్పా? అని నిలదీశారు. కేటీఆర్ గాని, ఆయన కుటుంబసభ్యులు గాని అక్కడ లేరని చెప్పారు. ఇదంతా సీఎం డైరెక్షన్‌లో జరుగుతున్నదని, ఇలాంటి కుట్రలు ఎన్నిచేసినా ఆత్మస్థైర్యం కోల్పోబోమని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు వై సతీశ్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలు నెలవేర్చలేక, ప్రజల తిరుగుబాటును తప్పించుకోలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే కేటీఆర్‌ను ఇరికించాలని సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. తమ ఎమ్మెల్యే ఇటీవల ప్రైవేట్ పార్టీకి వెళ్లి వస్తుంటే ఇరికించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎలాంటి వారెంట్ లేకుండా రాజ్ పాకాల ఇంటికి పోలీసులు, ఆబ్కారీవాళ్లు వెళ్లి సెర్చ్ చేశారని, వారి వృద్ధ తల్లితోపాటు పిల్లలను, కుటుంబ సభ్యులను పోలీసులు అవమానించేలా, భయపెట్టేలా చేశారని, ఈ చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు.పార్టీలో ఫారిన్ లిక్కర్ ఉండటం సహజమేనని, దానిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చన్నారు. కానీ, హామీలు నిలబెట్టుకోలేక కేటీఆర్‌ను ఇరికించాలనే దుర్మార్గమైన చర్యలను సహించబోమని హెచ్చరించారు. 'ఓటుకు నోటు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి.. తనపై బురద ఉన్నది.. కాబట్టి కేటీఆర్‌పై కూడా బురద చల్లాలని చూస్తున్నారు' అని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఇలాంటివి ఎన్నో చూశామని చెప్పారు. 'రాజ్ పాకాల ఇంట్లో జరిగిన పార్టీలో ఆయన తల్లి, అక్కలు, చెల్లెళ్లు, వాళ్ల పిల్లలు ఉన్నారు. అది రేవ్ పార్టీ అంటూ కొన్ని మీడియా చానళ్లు ప్రసారం చేస్తున్నాయి. ఇది మీకు తగునా?' అని నిలదీశారు. కొందరు అధికారులు రేవంత్‌రెడ్డికి కీలుబొమ్మలుగా మారారని, మితిమీరి పనిచేసిన అధికారుల చిట్టాను రాసుకుంటామన్నారు. రిటైర్డ్ అయినా తాము అధికారంలోకి వచ్చాక వారిని వదలబోమని హెచ్చరించారు.

రేవంత్, సంజయ్ మ్యాచ్ ఫిక్సింగ్

> రేవంత్‌రెడ్డి చీకటి మిత్రుడు బండి సంజయ్ ముందుగానే ఎలా రియాక్ట్ అవుతున్నారని వివేకానంద నిలదీశారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధుపై మాట్లాడని బండి సంజయ్, ప్రైవేట్ పార్టీపై వివరాలు అడుగుతున్నారంటే.. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ కాదా? అని ప్రశ్నించారు. ఇది ఆర్ఎస్ బ్రదర్స్ (రేవంత్, సంజయ్) కలిసి చేసిన కుట్ర అని ఎద్దేవా చేశారు. సంజయ్, రఘునందన్‌రావుతో రేవంత్‌రెడ్డి మాట్లాడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రిగా బండి సంజయ్ ఉన్నారని ఎద్దేవాచేశారు. కేటీఆర్‌పై బురద చల్లే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

కేటీఆర్ కేంద్రంగా కుట్రలు, కుయుక్తులు

- ఫ్యామిలీ పార్టీపై దౌర్జన్యం.. ఇన్ని నాటకాలా?
- కొత్త ఇంటిలో పార్టీ జరిగితే కేటీఆర్ ఇంటిపై దాడి ఎందుకు?
- పొలిటికల్ బాంబులు పేలుతాయన్న పొంగులేటి
- పక్కా ప్లాన్‌తో ఫ్యామిలీ దావత్‌పై దాష్టీకం

బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): ఇది ముమ్మాటికీ ప్రజాపాలన కాదు.. రాష్ట్రంలో జరుగుతున్నది ఆటవిక పాలన. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ, ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను ఎండగడుతున్న కేటీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం నీతిమాలిన రాజకీయాలకు పాల్పడుతున్నది.కేటీఆర్ కేంద్రం గా, కేటీఆర్ చుట్టూ కుట్రలు కుతంత్రాలు చేస్తున్నది. శనివారం రాత్రి జన్వాడ వద్ద కేటీఆర్ బంధువుల ఇంట్లో జరుగుతున్న కుటుంబ దావత్ మీద పోలీసులు దౌర్జన్యంగా దాడులు చేసి, పసిపిల్లలను, వృద్ధులను, మహిళలను ఫొటోలు తీస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేసినతీరు అత్యంత జుగుప్సాకరం. రాజకీయ విభేదాలు, వైషమ్యాలు ఉంటే.. రాజకీయంగానే చూసుకోవాలి. కానీ, పసిపిల్లలు, వృద్ధులపైకి స్నిఫర్‌డాగ్స్‌ను ఉసిగొల్పడం పరమ దాష్టీకం.అక్కడితో ఆగకుండా రాయదుర్గంలో ఉన్న కేటీఆర్ ఇంటి మీద దాడులు, సోదాలు చేయడం, ఫ్యామిలీ దావత్‌ను రేవ్ పార్టీ పేరుతో దుష్ప్రచారం చేయడం విశృంఖల బరితెగింపుతనం. శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం రాత్రి 10 గంట ల వరకు దాదాపు 23 గంటలపాటు పోలీసుల దాడులను ప్రహసనంగా సాగదీయడం సీఎం పైశాచిక ఆనందంలో భాగమే.

ఫామ్‌హౌస్ కాదు రాజ్ పాకాల ఇల్లు

నిజానికి పోలీసులు దాడి చేసింది ఫామ్ హౌస్ మీద కాదు.. రాజ్ పాకాల ఇంటి మీద. కుటుంబసభ్యులతో కలిసి కొంతకాలంగా ఆయన అక్కడే నివాసం ఉంటున్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో ఆయన కుటుంబసభ్యులు అంతా అంటే ఆయన 70 ఏండ్ల తల్లి, ఆమె చెల్లెలు, వారి పిల్లలు, రాజ్ పాకాల సోదరులు, చిన్నమ్మ పిల్లలు ఇలా.. దాదాపు రెండేండ్ల పసిపిల్లల దగ్గర నుంచి 70 ఏండ్ల వృద్ధుల వరకు అందరూ అక్కడే ఉన్నారు. ఇలాంటి కుటుంబ దావత్‌లపై పోలీసులు దాడులు చేయడమే చట్ట విరుద్ధం. కుటుంబం చేసుకుంటున్న ఫంక్షన్‌లోకి వెళ్లి పిల్లలను, మహిళలను ఫోన్లు, కెమెరాలతో వీడియోలు తీస్తూ తీవ్ర మానసిక వేదనకు గురిచేయడం ఆక్షేపణీయం. దాడులు చేస్తున్న వాళ్లు పోలీసులో,ఆ ముసుగులో వచ్చిన బందిపోట్లో అర్థం కాక వారు హడలిపోయారు. కానీ, ముఖ్యమంత్రి అనుకూల సోషల్‌మీడియాలో దీనిని రేవ్‌పార్టీ, డ్రగ్స్‌పార్టీ అంటూ అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తున్నారు. దావత్‌లో ఉన్న పసిపిల్లలు, వృద్ధులను రేవ్ పార్టీలో పాల్గొన్న స్త్రీలు, పురుషులు అంటూ ముఖ్యమంత్రి పీఆర్‌వో ప్రేరిత మీడియా ఇష్టం వచ్చిన స్క్రిప్ట్‌తో విష ప్రచారం చేస్తున్నది.

ఆ మద్యం తాగడం చట్ట సమ్మతమే

దాడుల్లో తాగేసిన సీసా, లిక్కర్ ఉన్న సీసాల్లో కలిపి మొత్తం 10.5 లీటర్ల ఇండియన్ మేడ్ విదేశీ మద్యం దొరికినట్టు ఎక్సైజ్ శాఖ పంచనామాలో పేర్కొన్నారు. తెలంగాణ ఏ-4 రిటైల్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన మద్యం కొంత దొరికింది. రాజ్ పాకాల తాను కొన్న డ్యూటీ ఫ్రీ మద్యానికి సంబంధించిన అన్ని బిల్లులు ఎక్సైజ్ అధికారులకు అందజేశారు. ఈ బిల్లులతో అధికారులు సంతృప్తి చెందినప్పటికీ, ఇంకా ఏమైనా నిషేధిత డ్రగ్స్ వాడుతున్నారా?అనే అనుమానంతో పోలీసు జాగిలాలతో (డాగ్‌స్క్వాడ్) తనిఖీలు చేయగా, ఎటువంటి డ్రగ్స్ దొరకలేదు. పోలీసు పంచనామాలో ఇవే అంశాలను పొందుపరిచారు. విదేశీ మద్యంలో కొంత డ్యూటీఫ్రీ మద్యం ఉన్నట్టు పంచనామాలో రాశారు. డ్యూటీఫ్రీ మద్యం అంటే ఎయిర్‌పోర్టు స్టోర్లలో దొరికే మద్యం. విదేశీ ప్రయాణాలు చేసేవారు మనిషికి రెండు బాటిళ్ల చొప్పున తెచ్చుకోవచ్చు. ఇది ఎన్డీపీఎల్ మద్యం కిందకు రాదు. కుటుంబ సభ్యుల దావత్ కాబట్టి వాళ్ల వద్ద ఉన్న బాటిల్స్ తెచ్చుకొని, ఒక్క దగ్గర పెట్టుకొని వారి ఇంట్లో వారు తాగుతున్నారు. ఇది చట్ట సమ్మతమే. కానీ, వారి మీద దౌర్జన్యంగా పోలీసులు దాడికి పూనుకోవడం, కేసులు నమోదుచేయడం రాజ్యాంగ విరుద్ధం. అయినా ఎక్సైజ్ పోలీసులు ఇంటి బాధ్యతలు చూసుకునే మేనేజర్ కార్తీక్ రాజేశ్ అనే వ్యక్తి మీద యూ/ఎస్ 34 ఏ, 34(1) ,ఆర్/డబ్ల్యూ 9 ఆఫ్ ఎక్సైజ్ యాక్ట్ కింద కేసులు నమోదుచేశారు. ఎక్సైజ్ చట్టాల ప్రకారం సొంత ఇండ్లలో జరిగే ఫ్యామిలీ దావత్‌కు ఈవెంట్ పర్మిషన్ కూడా అవసరం లేదు. ఒక వేళ ఎక్సైజ్ పోలీసులు దీనిని ఈవెంట్‌గానే గుర్తిస్తే ఎక్సైజ్ సెక్షన్ 34 ఏ ప్రకారం రూ. 5,000 కాంపౌండ్ జరిమానాతో కేసు ముగుస్తుంది. ఇంత చిన్న కేసును నానా రాద్ధాంతం చేస్తూ.. ఆదివారం కేటీఆర్ ఇంటి మీది కూడా దాడికి తెగబడటం రాజ్యాంగ బరితెగింపు కాకుంటే ఇంకేమిటి?

మొన్నటి నుంచే 'కుక్క' మొరుగులు!

ఇటువంటి దాడి ఒకటి జరుగబోతున్నదని కాంగ్రెస్ పాలకులు వారం రోజుల నుంచే లీకులు ఇస్తున్నారు. వాస్తవంగా రాజ్ పాకాల తన కొత్త ఇంటి గృహ ప్రవేశం దావత్‌కు రండి అంటూ అతని చిన్నమ్మ పిల్లలు, సోదరులను పిలుస్తున్నట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ ద్వారా విషయం పసిగట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేటీఆర్ టార్గెట్‌గా ఉచ్చు పన్నింది. అందులో భాగంగానే కొంతమంది జర్నలిస్టులను తీసుకొని సియోల్ పర్యటనకు వెళ్లిన సమాచార శాఖ మంత్రి.. అక్కడ ఉండగానే త్వరలో రాజకీయ బాంబులు పేలబోతున్నట్టు ప్రకటించారు. దానికి కొనసాగింపుగానే, అదే పార్టీ ప్రేరిత సోషల్‌మీడియాలో ఓ 'కుక్క' శుక్రవారం నుంచే మొరుగుతున్నది. ట్విట్టర్‌లో 'మీ కాపలా కుక్క' పేరుతో ఉన్న ఖాతా నుంచి 'రేపు మీ ముందుకు ఒక బ్లాస్ట్' అంటూ ట్వీట్ వచ్చింది. అది సోషల్‌మీడియాలో చెక్కర్లు కొట్టింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ డిజిటల్ మీడియా నేతలు సోషల్‌మీడియా వర్క్‌షాప్ పెట్టి,ఈ వీకెండ్‌లో అందరూ యాక్టివ్‌గా ఉండాలని సూచనలు ఇచ్చారు. అదే రాత్రి సోషల్‌మీడియాలో మీమ్స్, తంబ్‌నేల్స్‌తో రెచ్చిపోయారు.

ముఖ్యమంత్రి కార్యాలయం మానిటరింగ్

రాజ్ పాకాల ఇంటి మీద జరిగిన దౌర్జన్య కాండను సీఎం కార్యాలయం స్వయంగా మానిటరింగ్ చేసినట్టు సమాచారం. ముఖ్యమంత్రి స్వయంగా కొన్ని మీడియా చానళ్లకు ఫోన్ చేసి, త్వరలో రేవ్ పార్టీ బ్రేకింగ్ రాబోతున్నదని,దానిని కథనాలుగా మార్చి ప్రసారం చేయాలని కోరారు. అధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి దాడులు చేయించారు. ఇంట్లో తీసిన వీడియోలు, విజవల్స్, ఫొటోలను అధికారులను బలవంతపెట్టి నేరుగా సీఎంవోకు తెప్పించుకున్నారు. సీఎం పీఆర్‌వో వాటిని తమ అనుకూల సోషల్‌మీడియాలోకి వదిలారు. పోలీసుల పర్యవేక్షణలో ఎక్సైజ్ శాఖ అధికారులు అన్నివిధాలుగా పరిశీలించి, కేవలం డ్యూటీ ఫ్రీ మద్యం మాత్రమే పట్టుకొని ఎక్సైజ్ కేసులు నమోదుచేశారు. కానీ, స్వయంగా ముఖ్యమంత్రి అధికారుల మీద ఒత్తిడి తెచ్చి, ఆ కేసును మధ్యాహ్నానికి ఎన్‌డీపీఎస్ యాక్టు (నార్కోటిక్ డ్రగ్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్స్) కేసుగా మార్చారు. సాధారణంగా ఈ తరహా ఇంటి దావతుల మీద దాడులకు స్నిఫర్‌డాగ్స్‌ను తీసుకెళ్లరు. కానీ, రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దాదాపు 300 మంది పోలీసులు ఐదు స్నీపర్‌డాగ్స్, అధునాతన ఆయుధాలతో బీభత్సం సృష్టించారు. ఇక్కడ జరిగిన ప్రతి సన్నివేశానికి మసాలా జోడిస్తూ సీఎంవోలోని పీఆర్వోలు ఎప్పటికప్పుడు దీనిని రేవ్‌పార్టీగా చిత్రీకరిస్తూ సోషల్‌మీడియాలో, డిజిటల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ వచ్చారు.

కేటీఆర్ ఇంటిపై దాడులు ఎందుకు?

జన్వాడలో పోలీసులు దాడులు చేయడమే దౌర్జన్యం, చట్టవిరుద్ధం. దానికి కొనసాగింపుగా ఆదివారం కేటీఆర్ ఇంటి మీద కూడా దాడులు చేసి సోదాలు చేయడం బరితెగింపునకు తార్కాణం. కేటీఆర్ తన బామ్మర్ది దావత్‌కు అసలు వెళ్లనే లేదు. కాంగ్రెస్ ప్రచార మీడియా మాత్రం కేటీఆర్ దావత్‌కు వచ్చి, దాడికి పది నిమిషాల ముందే వెళ్లిపోయారని కథనాలు ప్రచారం చేశాయి. వాస్తవానికి శనివారం రాత్రే ఐదు పోలీసు జాగిలాలతో ఇంటిని అణువణువూ వెదికారు. అక్కడ డ్రగ్స్ ఆనవాళ్లు దొరకలేదు. అయినా రాజ్ పాకాలను, దావత్‌లో ఉన్న మరో 13 మందిని బలవంతంగా డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలకు పంపించా రు. ఆ పరీక్షల్లో రాజ్ పాకాల డ్రగ్ వాడలేదని తేలింది. మిగిలిన 13 మందిలో 12 మందికి నెగటివ్ వచ్చింది. ఒక్కరికి మాత్రమే పాజిటివ్ వచ్చింది. ఇంత మందిలో ఒకరికి మాత్రమే పాజిటివ్ అంటే.. అతను ఎక్కడో డ్రగ్ తీసుకొని ఉంటాడు. తదుపరి దర్యాప్తు చేయాలని పోలీసులు భావిస్తే, డ్రగ్ పాజిటివ్ వచ్చిన వ్యక్తి ఇంట్లో సోదాలు చేయాలి. కానీ, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కేటీఆర్ నివాసం మీద దాడులకు ప్రయత్నించారు. ఆతనేమీ సాధారణ వ్యక్తి కాదు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి వర్కింగ్‌కు ప్రెసిడెంట్. అంతకు ముందు ప్రభుత్వంలో కీలకమైన మంత్రి పదవిలో ఉన్నారు. రాష్ట్రంలో ప్రజాదరణ ఉన్న నేత. ఆయన ఇంటి మీదికి సెర్చ్ వారెంటు లేకుండా, కనీస అనుమతి లేకుండా పోలీసులు ఎలా వెళ్లారు? దీనిపై కోర్టులకు ఏమని సమాధానం చెప్తారు.

బండి సంజయ్‌కు అంత ఆత్రం ఎందుకు?

కేంద్ర మంత్రి పదవి పొందిన తరువాత బండి సంజయ్ దాదాపు ప్రజలకు దూరం అయ్యారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభు త్వం నిరుపేదల ఇండ్లు కూలగొడుతున్నా.. ఆయన ఒక్కమాట మాట్లాడలేదు. రుణమాఫీ కాకున్నా ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనలేదు. కానీ, దౌర్జన్యపూరితమైన దాడిపై కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా మొరిగితే.. ఆ వెంటనే స్పందించింది బీజేపీ నేతలే. ఆర్ బ్రదర్ ఫోన్ చేసినట్టు తెలుస్తున్నది. ప్రజా సమస్యల మీద స్పందించని కేంద్ర మంత్రి ఆగమేఘాల మీద వీడియా సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. ఈ లెక్కన రేవంత్ ప్రభుత్వంతో బీజేపీ అంటకాగుతున్నట్టు స్పష్టమవుతున్నదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

5% ఇండ్లలో హోం బార్లు

ఆర్థికంగా బాగా స్థిరపడిన చాలా మంది ఇండ్లలో బార్‌రూం ఉంటుంది. వీటికి అనుమతులు అక్కర్లేదు. ఎక్సైజ్ చట్టాలే అటువంటి వెసులుబాటు కల్పించాయి. డూప్లెక్స్, విల్లా ఉన్న చాలా మంది ఇండ్లలో బార్‌రూం ఉంటుంది. ఒక ఎక్సైజ్ సీనియర్ అధికారి అంచనా ప్రకారం హైదరాబాద్‌లో కనీసం 5% ఇండ్లలో హోం బార్లు ఉన్నాయి. వీటిలో 30 నుంచి 50 బాటిళ్ల మద్యం ఉంటుంది. ఇలాంటివారు విదేశీ ప్రయాణాలు చేసినప్పుడు ఆయా దేశాల్లో ప్రత్యేకంగా దొరికిన మద్యం తెచ్చుకుంటారు. ఈరోజు రాజ్ పాకాల ఇంటి మీద దాడి చేసినట్టుగానే ఎక్సైజ్ అధికారులు ఇంటువంటి వారి ఇండ్ల మీద కూడా దాడులు చేస్తారా? ఒకవేళ దాడులు చేస్త